క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఒంగోలు సబర్బన్: నగరంలోని పోలింగ్ కేంద్రాలను ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న ఆదివారం పరిశీలించారు. నగరంలో 1,200 కంటే ఎక్కువ ఓట్లున్న పోలింగ్ స్టేషన్లను, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ స్టేషన్లలో ప్రస్తుతం ఉన్న పరిస్థితి, సౌకర్యాలు, మౌలిక వసతులను గమనించేందుకు పరిశీలించినట్లు ఆర్డీఓ తెలిపారు. నగరంలోని గొడుగుపాలెం ప్రాథమిక పాఠశాలలోని 146, 147, 148 పోలింగ్ కేంద్రాలు, 37వ డివిజన్‌లోని వివేకానంద విద్యా విహార్‌లో 80, 81, 86, 87 పోలింగ్ కేంద్రాలు, మంగమూరురోడ్డులోని శివప్రసాద్‌కాలనీ సచివాలయంలో ఉన్న 82, 83, అక్కడే స్కూల్లోని 91, 92 పోలింగ్ కేంద్రాలు, రాజీవ్‌నగర్‌లోని మరో స్కూల్లో 87, 88 పోలింగ్ కేంద్రాలు, సెయింట్ జేవియర్స్ స్కూల్లోని 71, 72, 73, 74, 75, 76, 77, 78, 79 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రధాన కార్యాలయంలోని పోలింగ్ కేంద్రం 156, శ్రీనివాస సినిమా హాల్ దగ్గర గల డాన్ బాస్కో స్కూల్లోని 101 పోలింగ్ కేంద్రం, హౌసింగ్ బోర్డు కాలనీలోని కేంద్రియ విద్యాలయ ప్రాంగణంలో 162వ పోలింగ్ కేంద్రం, సత్యనారాయణపురంలోని 61వ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆర్డీఓ వెంట ఒంగోలు తహసీల్దార్ పిన్నిక మధుసూదన్‌రావు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


నక్రా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

మద్దిపాడు: విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యదర్శి డాక్టర్ కే సుబ్బారావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విశ్రాంత ఉద్యోగులకు డీఏ, అరియర్స్, పీఆర్సీ, ఈహెచ్‌ఎస్ ద్వారా వైద్యసేవలు వంటివి అందించాలని అధికారులను కోరారు. మండల శాఖ అధ్యక్షుడు డి.యలమంద మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తూనే ఉంటుందని తెలిపారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన కమిటీని అధికారికంగా ప్రకటించారు. ముందుగా విశ్రాంత ఉద్యోగుల సంఘ పితామహుడు నక్రా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రామకోటేశ్వరరావు, ప్రభాకరరావు, డి.వెంకటేశ్వర్లు, జి.నరసింహారావు, రామమోహనరావు, గంటా కోటేశ్వరరావు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో వర్షం

- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

కనిగిరిరూరల్: కనిగిరిలో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో వర్షం కురిసింది. సుమారు 8 గంటల నుంచి వర్షం కురవటంతో పాటు ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. చిరుజల్లులతో కూడిన నాన్పుడు వాన కురుస్తుండటంతోపాటు కరెంట్ లేక చీకట్లో ప్రజలు అవస్థలు పడ్డారు. పట్టణ శివారు కాలనీల్లోని రోడ్లు వర్షం ధాటికి చిత్తడిమయంగా మారాయి. రాత్రి 9.30 గంటల వరకు విద్యుత్ లేక ప్రజలు అంధకారంలోనే ఉన్నారు.

పశువుల పైనా పచ్చ కుట్రలు..!

పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుందనే సామెతను టీడీపీ పచ్చ పార్టీ నేతలు నిజం చేస్తున్నారు. జనమెరిగిన సత్యాలను సైతం అసత్యాలుగా చూపించబోతున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని స్వార్థపూరిత కుట్రలకు పాల్పడుతున్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడటం, వైఎస్సార్ సీపీ శ్రేణులను వేధించడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చివరకు ప్రజాప్రతినిధి, ఆధ్యాత్మికుడు అయిన 85 ఏళ్ల వృద్ధుడిని సైతం వదలకుండా తమ స్వప్రయోజనాల కోసం పశువులను అడ్డం పెట్టుకుని వేధిస్తున్నారు. ఆవులను కూడా వదలకుండా పచ్చ కుట్రలకు తెగబడుతున్నారు. నాగులుప్పలపాడు మండలంలోని చదలవాడ గ్రామంలో చోటుచేసుకున్న ఈ సంఘటన.. అధికారాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలకు నిదర్శనంగా నిలుస్తోంది.


పొలాల్లో మేత మేస్తున్న ఆవులు

- వృద్ధాప్యం కారణంగా ఆవులను పోషించలేని వ్యక్తి వాటిని ఇతరులకు అప్పగిస్తుండగా అడ్డగింత
- టీడీపీ నేతలు అడ్డుకుని రాద్ధాంతం
- దేవాలయానికి చెందిన ఆవులను కబేళాలకు తరలిస్తున్నారంటూ అసత్య ఆరోపణలు
- పశుపోషకుడు వైఎస్సార్ సీపీ మద్దతుదారుడైన సర్పంచ్ కావడమే కారణం
- 85 ఏళ్ల ఆధ్యాత్మికుడనే విచక్షణ కూడా లేకుండా సర్పంచ్‌పై దౌర్జన్యం
- అధికారాన్ని అడ్డం పెట్టుకుని పచ్చ పార్టీ నేతల స్వార్థపూరిత కుట్రలు

నాగులుప్పలపాడు:

మండలంలోని చదలవాడ గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాన్ని దాసరి ప్రసాదరావు అనే ఆధ్యాత్మికుడు అనేక ఏళ్లుగా అభివృద్ధి చేస్తూ వస్తున్నారు. ఈ ఆలయానికి 16 ఎకరాల దేవుని మాన్యం భూములు ఉన్నప్పటికీ ప్రసాదరావు రాకముందు అభివృద్ధికి నోచుకోలేదు. ఆయన వచ్చిన తర్వాత ఆలయంలోనే ఉంటూ అభివృద్ధి చేశారని ఆ గ్రామ ప్రజలంతా చెబుతుంటారు. కాగా, 15 ఏళ్ల క్రితం అగ్రహారం గ్రామానికి చెందిన ఓ దాత ఆవుదూడను పోషణ నిమిత్తం వరప్రసాదరావుకు దానం చేశారు. ఆలయ సమీపంలోనే పశువుల కొట్టం ఏర్పాటు చేసిన ప్రసాదరావు ఆవు దూడను పెంచి కాలక్రమంలో దాని ద్వారా మరికొన్ని గోవులను ఉత్పత్తి చేశారు. ఆవుల సంరక్షణ బాధ్యతను పూర్తిగా ఆయనే చూసుకునేవాడు. ఎవరైనా దాతలు దాణాకు సాయం చేస్తే స్వీకరించేవాడు. ఎప్పుడైనా వాటి పోషణ కోసం అవసరమైనప్పుడు ఆవుల్లో కొన్నింటిని రైతులకు విక్రయించేవాడు. ఈ విషయం గ్రామస్తులందరికీ తెలిసిందే. ప్రస్తుతం వరప్రసాదరావు సంరక్షణలో మొత్తం ఆవులు, దూడలు కలుపుకుని 22 వరకూ ఉన్నాయి. వాటి సంరక్షణ కోసం గ్రామానికి చెందిన పశువుల కాపరిని నెలకు రూ.20 వేల జీతానికి వరప్రసాదరావు నియమించాడు. ఆలయంతో ఎలాంటి సంబంధం లేకుండా తన సంపాదనలోనే జీతభత్యాలు, పశువుల సంరక్షణ చూసుకునేవాడు. అంతేగాకుండా ఊర్లో అందరికీ తలలో నాలుకలా ఉండే మనిషి కావడంతో గ్రామంలోని ప్రజలు 2021 పంచాయతీ ఎన్నికల్లో చదలవాడ గ్రామ సర్పంచ్‌గా నిలబెట్టి గెలిపించారు. అనంతరం గ్రామాభివృద్ధి కోసం అప్పటి అధికార పార్టీ అయిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడుగా వరప్రసాదరావు మెలిగారు. ఈ విషయాన్ని ఆ గ్రామంలోని టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోయారు. అతనిపై కక్ష పెంచుకున్నారు.


చదలవాడలోని ఆంజనేయస్వామి ఆలయం

ప్రస్తుతం అధికారంలోకి రావడంతో వేధింపులు...

ప్రస్తుతం వరప్రసాదరావు వయసు 85 ఏళ్లు కావడంతో ఆరోగ్యం సహకరించక పశువులను పోషించడం భారంగా మారింది. ఈ ఏడాది అనుకున్నంతగా మేత కూడా తోలలేదు. ఆదాయం కూడా అంతంతమాత్రంగానే ఉంది. పశువుల కాపరికి జీతం ఇవ్వడం కూడా కష్టంగా మారింది. దీంతో ఆవులను తనకు బాగా పరిచయమున్న రైతులకు మేపుకోవడానికి ఇచ్చేయడానికి ఆయన సిద్ధమయ్యాడు. అయితే, ఆ 22 పశువులను కాజేయాలన్న కుట్రతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కూటమి ప్రభుత్వం పేరు చెప్పి వరప్రసాదరావుపై దౌర్జన్యానికి దిగారు. ముసలి వయసులో ఆయనకు అండగా ఉండేవారెవరూ లేకపోవడంతో పశువులను అమ్ముకుని లక్షల్లో స్వాహా చేయవచ్చన్న కుట్రతో సర్పంచ్ వరప్రసాదరావుపై అసత్య ఆరోపణలు చేశారు. ఆలయానికి చెందిన ఆవులను కబేళాలకు తరలిస్తున్నాడంటూ ఆరోపణలు చేసి వాటిని రైతులకు ఇవ్వకుండా అడ్డుకున్నారు. గోవుల భక్షకుడు అంటూ సర్పంచ్‌పై పచ్చ పత్రికల ద్వారా విష ప్రచారం చేయించారు. దీంతో ప్రస్తుతం ఆ పశువుల ఆలనాపాలనా చూసేవారు లేక అలమటిస్తున్నాయి. ఆవులు, దూడలు, వృద్ధ సర్పంచ్‌ని కూడా వదలకుండా టీడీపీ నాయకులు స్వార్థపూరిత కుట్రలు చేయడాన్ని చదలవాడ గ్రామస్తులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. అధికార పార్టీ ముసుగులో కొందరు చేస్తున్న కుయుక్తులకు మూగజీవాలు బలైపోకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ వరప్రసాదరావుతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.


వృద్ధాప్యంతో అవస్థపడుతున్న సర్పంచ్ వరప్రసాదరావు

ఆవులన్నీ సూడి మోసి ఉన్నాయి :
నాలుగేళ్ల నుంచి పశువుల ఆలనాపాలనా నేను చూస్తున్నాను. నాకు జీతంగా నెలకు రూ.20 వేలను వరప్రసాదరావే ఇచ్చేవారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండటంతో ఆవులను రైతులకు ఇవ్వాలనుకున్నారు. ఆవులన్నీ సూడి మోసి ఉన్నాయి. అలాంటి వాటిని కబేళాలకు తరలిస్తున్నారనడం సమంజసం కాదు.
సూర్యనారాయణ, పశువుల కాపరి

ఆవులతో ఆలయానికి సంబంధం లేదు :
చదలవాడ ఆంజనేయస్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉంటున్న ఆవులతో ఆలయానికి ఎలాంటి సంబంధం లేదు. మా శాఖ తరపున ఆవుల పోషణకు ఎలాంటి నిధులూ ఇవ్వడం లేదు. కాకపోతే ఆవులను కటికవాళ్లకు అమ్ముతున్నారని గ్రామానికి చెందిన కొందరు నాయకులు గొడవ చేయడంతో ఆవుల తరలింపును అడ్డుకున్నాం. సర్పంచ్ వరప్రసాదరావు కూడా ఆవులు ఆకలికి అలమటించకుండా ఏ ఆలయానికైనా అప్పగించాలని మమ్మల్ని కోరారు.
ఈవో అనిల్

రైతులు పోషించుకుంటామంటేనే వారిని తీసుకొచ్చా:
రైతులకు ఆవులు, గేదెలను ఇప్పిస్తూ నేను మధ్యవర్తిగా వ్యవహరిస్తుంటాను. యద్దపాడు ప్రాంతానికి చెందిన నాకు చాలాకాలంగా వరప్రసాదరావు తెలుసు. ప్రస్తుతం ఆవులను పోషించడం చాలా కష్టంగా ఉందని చెప్పడంతో వాటిని పోషించుకునే రైతులకు ఇప్పించేందుకు వారిని తీసుకొచ్చాను. అంతేగానీ, కబేళాలకు తరలించేందుకు కాదు.
భవనం రామిరెడ్డి, మధ్యవర్తి

నాపై నిందలు వేసి గోల చేయడం బాధాకరం :
నేను 35 ఏళ్లుగా చదలవాడ ఆంజనేయస్వామి సన్నిధిలోనే ఉంటూ భక్తిభావంతో జీవిస్తున్నాను. ఆ స్వామిపై ఉన్న భక్తితో ఆలయ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తున్నాను. జీవిత చరమాంకంలో గ్రామానికి ఏదో మంచి చేస్తానన్న నమ్మకంతో గ్రామస్తులు నన్ను సర్పంచ్‌గా కూడా ఎన్నుకున్నారు. ఇంతకాలంగా ఆవుల సంరక్షణ చూసుకుంటూ ప్రస్తుతం వృద్ధాప్యం, ఆదాయం సన్నగిల్లడం కారణంగా వాటిని పోషించే ఓపిక లేక రైతులకు ఇవ్వడానికి అంగీకరించాను. ఎంతో ప్రేమగా పెంచుకున్న ఆవులు నా కళ్లెదుటే ఆకలితో అలమటిస్తుంటే చూడలేక ఈ నిర్ణయం తీసుకున్నాను. అంతేతప్ప ఎలాంటి పొరపాటూ చేయలేదు. కానీ, 85 ఏళ్ల వయసున్న నాపై రాజకీయ దురుద్దేశంతో అసత్య ఆరోపణలు చేసి నిందలు వేయడం, కొన్ని పత్రికల్లో గోల చేయడం చాలా బాధగా ఉంది.
దాసరి ప్రసాదరావు, సర్పంచ్, చదలవాడ

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న చుండూరి రవిబాబు


పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

- పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు పిలుపునిచ్చారు. ఒంగోలులోని 19వ డివిజన్ బ్యాంకు కాలనీ 4వ లైన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ కుల, మత, వర్గ, పార్టీలు చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కానీ, కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తిచేసుకున్నప్పటికీ గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పేద, మధ్య తరగతి, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను దూరం చేసి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. వీటన్నింటినీ ప్రజల్లో తీసుకెళ్లి ప్రజా సమస్యలపై పోరాడి వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలని కోరారు. తద్వారా వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని చుండూరి రవిబాబు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, పేరం ప్రసన్న, ఖలీల్, పాలడుగు రాజీవ్, బుజ్జి, డివిజన్ అధ్యక్షుడు రాజేష్, జి.వెంకటేశ్వర్లు, సుతారం శ్రీనివాసులు, ఎ.రామాంజనేయులు, ఎం.అశోక్, జి.కోటేశ్వరరావు, శ్రీకాంత్, హరిబాబు, నాయక్, కోటి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ బైక్ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న మరాఠా మిత్ర బృందం


ఊరేగింపులో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం

ఒంగోలు మెట్రో: మరాఠా సంఘ అధ్యక్షుడు కాశే వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మరాఠా మిత్ర బృందం, ఛత్రపతి శివాజీ మహారాజ్ అభిమానులు ఆదివారం సాయంత్రం ఒంగోలులో ఛత్రపతి శివాజీ మహారాజ్ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మరాఠీపాలెంలోని శివాజీ విగ్రహం వద్ద నుంచి అంజయ్య రోడ్డులోని ఏకేవీకే కాలేజీ వరకు శివాజీ మహారాజ్ విగ్రహంతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకేవీకే కాలేజీలో మధ్యాహ్నం రెండు గంటలకు సంస్కార భారతీయ ఆధ్వర్యంలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన, క్విజ్ పోటీలు ఏర్పాటు చేశారు. గద్దలగుంట ఓరియంటల్ హైస్కూల్ అధ్యాపకుల కమిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించగా, సాయంత్రం ఆరు గంటలకు డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి సాయిబాబా నాట్యమండలి (విజయవాడ) వారిచే జయహో ఛత్రపతి శివాజీ మహారాజ్ చారిత్రక నాటకం ప్రదర్శించారు. సీబీఆర్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్, ఎడ్యుకేషనల్ నిర్వహణలో ఈ ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో ఈదర హరిబాబు, ఓరియంటల్ హైస్కూల్ కార్యదర్శి బి.చలపతిరావు, సంస్కార భారతి ప్రమోద్, సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జూలై 3న కొత్తపట్నం మండల సమావేశం

కొత్తపట్నం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని స్థానిక ఆ కార్యాలయంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధ్యక్షతన జూలై 3వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీకృష్ణ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ మెంబర్, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు. సమావేశానికి హాజరకాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాటల్లోనే ప్లాస్టిక్ నిషేధం..!

- చీమకుర్తి మండలంలో రోజురోజుకూ పెరిగిపోతున్న కవర్ల వినియోగం
- ఫొటోలకే పరిమితమైన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర
- పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్ కవర్లు
- ప్రభుత్వం విధించిన నిషేధంపై అవగాహన కల్పించని అధికారులు


చీమలమర్రి స్కూల్ ముందున్న ప్లాస్టిక్ కవర్ల వ్యర్థాలు


ప్లాస్టిక్ కవర్లో వస్తువులు తీసుకెళ్తున్న వ్యక్తి

చీమకుర్తి రూరల్: టిఫిన్లు, కూరగాయలు, పండ్లు, పాలు, పూలు, కిరాణా సామాన్లు.. ఇలా చెప్పుకుంటూపోతే.. ఒక్కటేమిటి, ప్రతి వస్తువునూ ప్లాస్టిక్ కవర్లలోనే ప్రజలు ఇళ్లకు తీసుకెళ్తున్నారు. ఇంతటితో ఆగడం లేదు.. వేడి వేడి టీ, కాఫీ, పాలు, చల్లటి పానీయాలను సైతం ప్లాస్టిక్ కవర్లలోనే పార్శిళ్లు తెచ్చుకుంటూ రోగాలను మోసుకొస్తున్నారు. ఒకప్పటి చిన్న వెసులుబాటు.. నేడు పూర్తిగా అలవాటుగా మారింది. ఏకంగా మానవ మనుగడకే ప్రమాదకరంగా తయారైంది. సరుకుల రవాణాకు సులువుగా ఉండే పాలిథిన్ కవర్లు నేడు ప్రజల నిత్యావసరాల్లో అత్యంత కీలకమైపోయాయి. ప్రజలకు, పర్యావరణానికి ప్లాస్టిక్ పెనుముప్పని తెలిసినప్పటికీ వాటిని వాడటం మానుకోలేని స్థితికి ప్రజలు చేరుకున్నారు. ప్లాస్టిక్‌పై ప్రభుత్వం నిషేధం విధించినప్పటికీ క్షేత్రస్థాయిలో పాలకులు, అధికారులు, ఉద్యోగులకు చిత్తశుద్ధి లేకపోవడంతో కవర్ల వాడకం దశాబ్దాల తరబడి సాగుతూనే ఉంది.

మొక్కుబడిగా స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర...

కూటమి ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం పరిసరాల పరిశుభ్రతలో భాగంగా స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అయితే ఈ కార్యక్రమాన్ని అత్యంత మొక్కుబడిగా జరుపుతోంది. ఓ ర్యాలీ నిర్వహించి ఫొటోలు తీసుకుని ముగిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగంపై ఏ ఒక్క అధికారిగానీ, ప్రజాప్రతినిధిగానీ ప్రజలకు అవగాహన కల్పించడం లేదు. దీంతో అధికారుల మెప్పుకోసమే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రకటనలకే పరిమితమైన ప్లాస్టిక్ నిషేధం...

పాలిథిన్ కవర్ల వినియోగాన్ని 2011లో అప్పటి ప్రభుత్వం నిషేధించింది. మొదట కార్పొరేషన్, మున్సిపాలిటీ, ఆ తర్వాత గ్రామ పంచాయతీల పరిధిలో అమలు చేయాలని ఆదేశించింది. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా జనపనార, కాగితం కవర్లు వాడాలని ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో పాలిథిన్ కవర్లను నిషేధించాలని మండల అధికారులు సైతం ప్రకటించారు. ఆ నిషేధం కేవలం ప్రకటనలకే పరిమితం అవడంతో వినియోగం విచ్చలవిడిగా సాగుతోంది.

పొంచి ఉన్న పెనుప్రమాదాలు...

పాలిథిన్ కవర్లు మట్టిలో కలవకపోవడంతో నీరు, మట్టి కాలుష్యమై పర్యావరణానికి పెనుముప్పుగా పరిణమిస్తోంది. దీంతో ప్రమాదం పొంచి ఉందని పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. వాన నీరు త్వరగా భూమిలోకి ఇంకిపోకుండా ప్లాస్టిక్ కవర్లు అడ్డుపడతాయి. దాని వలన అనేక రకాల సమస్యలు ఉత్పన్నమవుతాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో పాటు ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతాయి. కాలువలో ప్లాస్టిక్ పేరుకపోయి మురుగునీటి ప్రవహాన్ని అడ్డుకుంటున్నాయి. దీంతో ఎక్కడికక్కడే మురుగునీరు నిలిచి దోమల ఉత్పత్తి విపరీతంగా పెరుగుతోంది. తద్వారా వ్యాధులు ప్రబలుతున్నాయి. మూగజీవాలు కవర్లలో ఉన్న వ్యర్థ పదార్థాలను చూసి కవర్లతో పాటు తినేయడం వలన వాటి కడుపులో పేగులకు చుట్టుకుని ప్రాణాలు కోల్పోతున్నాయి. కానీ, ప్రభుత్వాలు, అధికారులు మాత్రం వీటన్నింటిపై ప్రజలకు సక్రమంగా అవగాహన కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

చీమకుర్తి మండలంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్ల వాడకం...

మండలంలో చీమకుర్తి పట్టణంతో పాటు 24 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటి పరిధిలో మొత్తం 41 గ్రామాలు ఉన్నాయి. గ్రానైట్ గనులు, పరిశ్రమలు పెద్ద ఎత్తున ఉండటంతో స్థానిక ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులు అధిక సంఖ్యలో ఉంటుంటారు. దీంతో అన్నిరకాల వ్యాపారాలతో చీమకుర్తి మండలం కళకళలాడుతూ ఉంటుంది. పంచాయతీల పరిధిలో దాదాపు 1,200కు పైగా కిరాణా, కూరగాయలు, చికెన్, తదితర దుకాణాలు ఉన్నాయి. ఆయా వ్యాపారులంతా ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నారు. సరుకుల విక్రయానికి నిత్యం వాటినే వినియోగిస్తున్నారు. వాటిని వాడిన తర్వాత ఎక్కడబడితే అక్కడ ప్రజలు పడేస్తుండటంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే కనిపిస్తున్నాయి.

ప్రజల సహకారంతోనే నిషేధం సాధ్యం :
పాలిథిన్ కవర్ల నిషేధం ప్రజల సహకారంతోనే సాధ్యం. వ్యాపారులు, వినియోగదారులందరిలో మార్పు రావాలి. పాలిథిన్ కవర్ల వినియోగం పర్యావరణానికి చాలా హాని కలిగిస్తోంది. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.
వి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, చీమకుర్తి

ప్లాస్టిక్‌తో క్యాన్సర్ వచ్చే ప్రమాదం :
ప్లాస్టిక్ కవర్లు వాడటం వల్ల ప్రజలు క్యాన్సర్ బారిన పడతారు. ప్లాస్టిక్ కవర్లలో వేడి ఆహార పదార్థాలను ప్యాక్ చేయరాదు. అలాచేస్తే ప్లాస్టిక్ రసాయనాలు మనిషి శరీరంలోకి చేరతాయి. దీంతో కొత్తకొత్త వ్యాధులు వస్తాయి. ఇంటి బయటకు వెళ్లేటప్పుడు ప్రతిఒక్కరూ గుడ్డసంచులు తీసుకెళ్తే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించవచ్చు. మార్పు ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలి. అప్పుడే ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించవచ్చు.
అఫ్సర్, వైద్యాధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బండ్లమూడి